అడవికి రక్షకులు..!



వారు అడవితల్లి బిడ్డలు.. వన్యమృగాల మధ్య అడవి సింహాలు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవితల్లి రక్షణకు అడుగడుగునా గస్తీ నిర్వహిస్తున్నారు. నరికి వేతకు గురికాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

8లో▸



'గుర్తింపు'పై నేడు నిర్ణయం

సింగరేణిలో 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలపై నేడు కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోని సింగరేణి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు కార్యాలయంలో సమావేశం జరుగనుంది.

10లో▸

గరిష్టం/కనిష్టం
42.7/31.8

వాతావరణం

ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. చినుకుల పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఐఈవో

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, మందమర్రి, చెన్నూర్, జైపూర్, జన్నారం, దండేపల్లి, బెల్లంపల్లి (బాలికలు), ప్రభుత్వ కళాశాల బెల్లంపల్లి, లక్సెట్టిపేట (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ, బాలురు), ప్రభుత్వ జూనియర్ కళాశాల, మిమ్స్, ఎస్ఆర్ఆర్, విజన్, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు (ఉదయం) 1,562 మందిగానూ 1,455 మంది హాజరుకాగా 107 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 5:30 గంటల వరకు నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 686 మందికిగానూ 644 మంది హాజరుకాగా 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు.

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 14నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలి పారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు ని ర్వహించనున్న పరీక్షలకు 1,624 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నా రు. మంచిర్యాలలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, లక్సెట్టిపేటలోని జెడ్పీ బా లికల ఉన్నత పాఠశాల, చెన్నూర్ ప్రభుత్వ ఉ న్నత పాఠశాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలికలు), బెల్లంపల్లి బజార్ ఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాల, తాళ్ల గురిజాల టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలుర) జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సందేహాల నివృత్తికి 08736-252420, 7032463114 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

మంచిర్యాలటౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించేందుకు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంచిర్యాలలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్‌హాల్, బెల్లంపల్లిలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్, చెన్నూరులోని హబీబ్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి మహిళా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, డీఆర్డీఏ, మెప్మాకు చెందిన మహిళా సంఘాలు, ఆర్పీలు, సీవోలు, ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందుతున్న మహిళలు కూడా ఇందులో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. పలు శాఖల్లో ఉత్తమ సేవలను అందిస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించనున్నారు. వేడుకల్లో భాగంగా జిల్లాలోని దివ్యాంగ మహిళలకు రుణాలు, బ్యాటరీ వీల్‌చైర్ 1, ఎంఆర్ కిట్స్ 4 ఇవ్వనున్నారు.

హామీలు నెరవేర్చడంలో కేసీఆర్ విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథ్

నస్పూర్: సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు అన్ని సౌకర్యాలతో పది వేల క్వార్టర్లు నిర్మించి ఇస్తామని, సొంతింటి నిర్మాణానికి 200 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లు కావస్తోందన్నారు. ఈ నెల 9న నస్పూర్ బహిరంగ సభలో సింగరేణి కార్మికులకు ప్రయోజనం చేకూరే వరాలు ప్రకటించకపోవడంతో నిరాశ చెందుతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే కార్మి కులకు పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రద్దు చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు శాలువా కప్పేందుకు ప్రయత్నిస్తే ఆయనను సీఎం అవమానకరంగా పక్కకు నెట్టివేసి మంచిర్యాల నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అగల్డ్యుటి రాజు, ప్రధాన కార్యదర్శి సత్రం రమేశ్, నా యకులు పోనిగంటి మధు, మిట్టపల్లి మొగిలి, మహేశ్, సామ్రాజ్ రమేశ్, బండారి శ్రీకాంత్, రాయమల్లు, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో స్వాగతం



దండేపల్లి: బడి తాళం తీస్తున్న విద్యార్థిని



లక్సెట్టిపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులు

- వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలు
- మొదటి రోజు హాజరు అంతంతే
- కొత్త విద్యా సంవత్సరం.. పాత సమస్యల స్వాగతం
- అడుగంటిన బోర్లతో నీటి కోసం తండ్లాట.
- పాఠశాల శుభ్రత..పట్టేదెవరికి.?

మంచిర్యాలఅర్బన్: నూతన విద్యాసంవత్సరంలో సోమవారం బడిగంట మోగింది. ఇన్నాళ్లూ ఆటపాటలకు పరిమితమైన విద్యార్థులు పుస్తకాల సంచి భుజానికి వేసుకుని బడి బాట పట్టారు. కొన్ని పాఠశాలల్లో మామిడి తోరణాలతో అలంకరించారు. నూతన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. జిల్లాలోని 713 లోకల్‌బాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో 39,439 మంది విద్యార్థులు ఉన్నారు. ఎండల తీవ్రతకు తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 15 శాతం కూడా తరగతులకు హాజరుకాలేదు. స్కావెంజర్లను తొలగించడంతో పాఠశాలల్లో పరిశుభ్రత ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఈ బాధ్యతలను పంచాయతీ సిబ్బందికి అప్పగించడంతో రోజూ వచ్చి తాము పనిచేయలేమని చెప్తున్నారు. దీంతో కొన్ని పాఠశాలల్లో దినసరి కూలీని నియమించుకున్నారు.

నత్తనడకన 'మన ఊరు–మన బడి' పనులు

జిల్లాలోని పాఠశాలల్లో మన ఊరు–మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో మొదటి విడతలో 248 పాఠశాలలను ఎంపిక చేసి రూ.90 కోట్ల 9లక్షల పనులకు అంచనా వేయగా ఇప్పటి వరకు రూ.9కోట్ల 89 లక్షల నిధులు మంజూరయ్యాయి. మండలానికి రెండు చొప్పున 35 మోడల్ స్కూళ్లలో పనులు చేపట్టారు. ఇందులో 18 స్కూళ్లలో పనులు పూర్తికావడంతో ప్రారంభించారు. మరో 12 స్కూళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన పాఠశాలల్లో పెయింటింగ్ పనులు సాగుతున్నాయి. మన ఊరు–మన బడి కింద చేపట్టిన వివిధ పనుల్లో 60 శాతం మేర పూర్తయ్యాయి. 59 పాఠశాలల్లో చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 68 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. 131 పాఠశాలల ప్రహరీ నిర్మాణం చేపట్టగా 81 పూర్తయ్యాయి. ఈ ఏడాదైనా విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

బడుల్లో సమస్యల తిష్ట

నెన్నెల: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా 11 పాఠశాలలు ఎంపిక కాగా 70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు పూర్తయినా నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి.

అడుగంటిన బోర్లతో నీటికి కటకట

జిల్లాలోని 39 పాఠశాలల్లోని బోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో నీటికోసం ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 720 మందికి పైగా విద్యార్థులకు రెండు బోర్‌వెల్స్ ఉన్నాయి. మధ్యాహ్న భోజనం (వంట) కోసం, మరుగుదొడ్లకు ఇదే నీటిని వాడుతున్నారు. వేసవిలో మున్సిపాలిటీ ట్యాంకర్‌తో నీటిని తెప్పించుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నవాటికి నీటి సరఫరా కాకపోవటంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాల్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.



దండేపల్లిలో తొలగించని భవన శిథిలాలు



నీటిని పట్టుకుంటున్న వంట నిర్వాహకులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద చేపట్టిన నూతన పక్కా భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తరగతి గదులు కూల్చివేయడంతో ఇరుకుగదుల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

నస్పూర్: తీగల్‌పహాడ్, సీతారాంపల్లి, విలేజ్ నస్పూర్ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదు.



దండేపల్లిలో విద్యార్థులకు పూలతో స్వాగతం

హాజరు అంతంతే

జిల్లా కేంద్రంలోని సినిమావాడ స్కూల్‌లో 230 మంది విద్యార్థులకుగానూ 30 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 720 మందికిగానూ 205 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 317 మందికిగానూ 36 మంది, పాత మంచిర్యాల పాఠశాలలో 115 మందికిగానూ 10 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చెట్ల కిందే పాఠాలు



చెట్లకిందే పాఠాలు వింటున్న చెన్నూర్ ఎన్‌పీవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చెన్నూర్: పట్టణంలోని ఎన్‌పీవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో మన ఊరు–మన బడి కింద చేపట్టిన తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో తొలిరోజు విద్యార్థులకు చెట్లకిందే పాఠాలు బోధించారు. చెన్నూర్ మున్సిపాలిటీలో 8 పాఠశాలల మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ఒక్కటి మాత్రమే పూర్తయ్యింది.

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి హరిజనవాడ పాఠశాలలో నూతన భవనానికి మరమ్మతులు పూర్తికాకపోవడంతో పాత భవనంలోనే విద్యార్థులు కూర్చుంటున్నారు. పాఠశాలలో బోరుబావి పనిచేయడం లేదు. మిషన్ భగీరథ నల్లా నీరు రావడం లేదు. విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో తాగునీరు తెచ్చుకున్నారు.

భీమారం: మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చేపట్టిన మన ఊరు–మన బడి పనులు నేటికీ పూర్తికాలేదు.

జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 285 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు నెలకొన్నాయి.

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడి చెత్త అక్కడే పడిఉంది. **దండేపల్లి:** దండేపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. ఓ పాఠశాలలో 50 మంది విద్యార్థులకుగానూ కేవలం 13 మంది మాత్రమే హాజరయ్యారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో శిథిల గదులను కూల్చివేసి అలాగే ఉంచడంతో విద్యార్థులు కొంత ఇబ్బందులకు గురయ్యారు.

20 శాతం దాటని హాజరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 189 మంది విద్యార్థులకుగానూ ముగ్గురు మాత్రమే పాఠశాలకు వచ్చారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

వేమనపల్లి: వేమనపల్లి ప్రైమరీ పాఠశాలలో 112 మంది విద్యార్థులకు గాను 18 మంది మాత్రమే హాజరయ్యారు. కిచెన్ షెడ్ ఫ్లోరింగ్ కాలేదు. తాగునీటి సమస్య నెలకొంది.

భీమిని: కన్నెపల్లి జెడ్పీ పాఠశాలలో 300 మందికిగానూ 28మంది విద్యార్థులు హాజరయ్యారు.



తంగళ్లపల్లి హైస్కూల్‌లో ముగ్గురు విద్యార్థులు

అసంపూర్తి పనులతో స్వాగతం

జన్నారం: ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు–మన బడి కింద చేపట్టిన అదనపు గదుల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. ఇటీవలే పాత భవనం కూల్చడంతో అసౌకర్యంగా మారింది. మొదటి రోజు విద్యార్థులకు అసంపూర్తి పనులతో స్వాగతం చెప్పాల్సి వచ్చింది.



ధర్మారంలో అసంపూర్తి నిర్మాణం

వేళకు రాని రైళ్లు..!

'ట్రైన్ నంబరు 17233 సికింద్రాబాద్ నుంచి బల్లర్షా వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటల పదమూడు నిమిషాలు ఆలస్యంగా నడుస్తోంది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యానికి చింతించుచున్నాం.' ఇదీ నిత్యం స్టేషన్లలో వినిపించే రైల్వే అధికార ప్రకటనలు. కొంతకాలంగా రైళ్ల రాకపోకలు తీవ్ర ఆలస్యమవుతూ ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. – సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

- ఎక్కాల్సిన ప్రతీ రైలు ఆలస్యమే
- సిర్పూర్ నుంచి మంచిర్యాల వరకు..
- అన్ని ట్రైన్లు గంటల కొద్దీ జాప్యం
- మూడోలైన్ నిర్మించినా తప్పని తిప్పలు

ఎప్పుడొస్తయో తెలియదు

బల్లర్షా నుంచి కాజీపేట మధ్య నడిచే కాజీపేట ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌టౌన్ నుంచి భద్రాచలంరోడ్డు వరకు వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌లు ఏ రోజూ సమయపాలన పాటించడం లేదు. ఉదయం, సాయంత్ర పూట ఆయా స్టేషన్లలో ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూస్తున్నారు. రైళ్లు ఎప్పుడు వస్తాయో తెలియక సమయం వృథా చేసుకుంటున్నారు. దీంతో తమ రోజువారి కార్యకలాపాల్లోనూ ప్రభావం చూపుతోంది.

'భాగ్యనగర్' రోజూ లేటే!

బల్లార్షా నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి బల్లార్షా మధ్య రోజూ నడుస్తున్న ట్రైన్లు ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఆలస్యంగానే నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి 3.35 గంటలకు బయలుదేరి కాగజ్‌నగర్ వరకు వెళ్లాలంటే రాత్రి ఒకటి, రెండు గంటలవుతోంది. దీంతో మంచిర్యాల, రవీంద్రఖని, మందమర్రి, బెల్లంపల్లి, రేచిని రోడ్, ఆసిఫాబాద్ రోడ్, కాగజ్‌నగర్, సిర్పూర్(టీ) వరకు వెళ్లాల్సిన ప్రయాణికులు అరిగోస పడుతున్నారు. రాత్రి పూట రైలు దిగి ఇంటికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక స్టేషన్‌లోనే పడుకుని తెల్లారి వెళ్తున్నారు. గతంలో 9 గంటలకే వస్తుండగా ప్రస్తుతం తీవ్ర జాప్యం జరుగుతోంది.

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లూ ఆలస్యమే

సికింద్రాబాద్‌కు వెళ్లే ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్, ఏపీ, గ్రాండ్ ట్రంక్, నవజీవన్, చెన్నై సెంట్రల్, రాప్తిసాగర్‌తో పాటు పలు వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు సైతం గంట, రెండు గంటల ఆలస్యంతో నడుస్తున్నాయి.

అన్ని రైళ్లూ ఆలస్యమేనా?

దూరం, దగ్గర అని తేడా లేకుండా చవక, భద్రత, సౌకర్యవంతంగా గమ్యస్థానాలను చేరుకునేందుకు ఎక్కువగా పేద, మధ్య తరగతి వారు రైలు ప్రయాణాన్ని ఆశ్రయిస్తారు. అయితే సకాలంలో రైళ్లు స్టేషన్లకు రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది నెలలుగా ఇదే తీరుగా ఉండడంతో వివిధ అవసరాల కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, సికింద్రాబాద్, విజయవాడ, చెన్నై వైపు వెళ్లే వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలస్యంగా నడుస్తున్నాయని మైకుల్లో అనౌన్స్ చేసి అసౌకర్యానికి చింతించుచున్నాం అంటూ చెప్పి రైల్వే అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిల్లా నుంచి కాజీపేట నుంచి కాగజ్‌నగర్, భద్రాచలం రోడ్ స్టేషన్ల మధ్య నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు ప్రయాణం చేస్తుంటారు. వీరితో పాటు వివిధ అవసరాలకు హైదరాబాద్ రాకపోకలు సాగించేవారు ఉన్నారు.



రవీంద్రఖని రైల్వేస్టేషన్

పెరిగిన టికెట్ రేట్లు

గతంతో పోలిస్తే టికెట్ల రేట్లు సైతం భారీగా పెరిగాయి. కరోనా ప్రభావంతో సీనియర్ సిటిజన్స్, వివిధ కేటగిరీలకు ఇస్తున్న రాయితీలు సైతం ఎత్తేశారు. ప్యాసింజర్ ట్రైన్ల చోట ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. దీంతో టికెట్ రేట్లు సైతం పెరిగాయి. గతంలో ఉన్న టికెట్ ధరలతో పోలిస్తే రూ.15 నుంచి 20 వరకు పెరిగాయి.

మూడో లైన్ నిర్మించినా..

ఇన్నాళ్లూ రెండు లైన్ల బ్రాడ్ గేజ్ వ్యవస్థ ఆధారంగానే రైళ్ల రాకపోకలు సాగించాయి. దీంతో ఒకే ట్రాక్‌పై వెళ్ళాల్సి వచ్చినప్పుడు ఒక ట్రైన్ నిలిపి మరో ట్రైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు. రైల్వేకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న గూడ్స్ రైళ్లు సరుకులు చేరవేయడంలోనూ జాప్యం జరిగేది. ఉత్తర, దక్షిణ భారతదేశానికి కీలకంగా ఉన్న కాజీపేట, బల్షార్షా మధ్య మూడో రైల్వే ట్రాక్ గతేడాది నుంచే అందుబాటులోకి వచ్చింది. అయితే మూడు లైన్లు అందుబాటులోకి వచ్చినా ప్యాసింజర్లను సమయానికి గమ్యస్థానాలకు చేర్చడంలో తీరు మారడం లేదు. పదేళ్లుగా సికింద్రాబాద్–కాజీపేట జంక్షన్ మీదుగా బల్లార్షా వరకు కొత్త రైల్వేవీ ప్రారంభం కాలేదు. దీంతో పాతవాటిలోనే సీట్లు లేకున్నా కిక్కిరిసి పోతున్నారు. ఇక కోవిడ్ ప్రభావం పేరుతో మంచిర్యాల, బెల్లంపల్లి స్టేషన్లలో పలు సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ తీసేశారు. అయినా పాత ట్రైన్లు కూడా సమయ పాలన పాటించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పట్టించుకునే వారే లేరు



రైళ్లు సకాలంలో నడపాలని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. కొత్త ట్రైన్లు రాక, ఉన్నవి టైంకు నడపక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీకి తగినట్లుగా ట్రైన్లు నడపాల్సి ఉన్నా పట్టించుకునే వారే లేరు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సమయానికి ట్రైన్లు నడపాలి.

– కామని శ్రీనివాస్, రైల్వే సమస్యల సాధన సమితి నాయకుడు

24 నుంచి ఓటరు జాబితా సవరణ

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా శాఖల సముదాయ సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు దాసరి వేణు, శ్యామలాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన పౌరులను ఓటర్లుగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 24 నుంచి 25 వరకు బూత్‌స్థాయి అధికారులతో ఇంటింటి పరిశీలన, 24 నుండి జూలై 24 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితాలో తప్పుడు వివరాల తొలగింపు, జూలై 25 నుంచి 31 వరకు ఫార్మాట్ 1 నుంచి 8 వరకు ముసాయిదా జాబితా రూపకల్పన, ఆగస్టు 2 నుంచి 31 వరకు ముసాయిదాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 22న అభ్యంతరాలను పరిశీలించి అక్టోబర్ 4 న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. అనర్హులు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, నకిలీ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని సూచించారు.

పోలీసుల సేవలు మరువలేనివి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- పోలీసుల ఆధ్వర్యంలో 2 కే రన్

మంచిర్యాలక్రైం: పోలీసుల సేవలు మరువలేనివని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మంచిర్యాల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు నిస్వార్థ సేవకులన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. స్థానిక ఐబీ చౌరస్తాలో ప్రారంభమైన 2 కేరన్ బెల్లంపల్లి చౌరస్తా మీదుగా ప్రభుత్వ బాలుర మైదానం వరకు సాగింది. మైదానంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు, ఎస్సైలు, గుడిపేట బెటాలియన్ సిబ్బంది, ఫిట్‌నెస్ సెంటర్, వాకర్స్ అసోసియేషన్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థినులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది, విద్యార్థులు

డిజిటల్ తరగతులపై శిక్షణ

మంచిర్యాలఅర్బన్: డిజిటల్ తరగతులపై ఉ న్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవా రం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. మన ఊరు–మనబడిలో ఎంపికైన 59 ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్లాట్ పన ల్ (ఐఈపీ) ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేసేందుకు అవగాహన కల్పిస్తున్నారు. 37 పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరి యల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనా రాయణ మూర్తి, జిల్లా రిసోర్స్ పర్సన్ శ్రీని వాస్, రాము, సంతోష్, సుమన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి



గేదెల మృతదేహాలు

దహెగాం: మండలంలోని చిన్నరాస్పల్లి గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతిచెందాయి. రైతులు ఏమ శంకరయ్య, జంగిటి పర్వతాలకు చెందిన గేదెలు సోమవారం ఉదయం మేతకు వెళ్లాయి. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నస్పూర్: పట్టణంలోని నస్పూర్ గేటు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడి వడదెబ్బతో మృతిచెందినట్లు ఎస్సై రవికుమార్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఓ మార్బుల్ షాప్ వెనుకాల వేప చెట్టు కింద వృద్ధుడు చనిపోయి ఉన్నాడు. అతని వయస్సు 75 నుంచి 80 ఏళ్లు ఉండవచ్చని, తెల్లని దోవతి, ఫుల్ బనియన్, బ్లూ కలర్ స్లిప్పర్స్ ధరించాడు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహం భద్రపర్చామని, వృద్ధుడి వివరాలు తెలిస్తే సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

ఆదివాసీలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న అశోక్

నెన్నెల: ఆదివాసీ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెర్‌పల్లి అశోక్ అన్నారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలన్నారు. జిల్లా నాయకులు భాగాల రాజన్న, ఎర్మ పున్నం, లక్ష్మి, జంబి బాపు, దామోదర్, శంకర్, రమేష్, వనిత, పెంటక్క పాల్గొన్నారు.

వారు అడవితల్లి బిడ్డలు.. వన్యమృగాల మధ్య అడవి సింహాలు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవితల్లి రక్షణకు అడుగడుగునా గస్తీ నిర్వహిస్తున్నారు. నరికి వేతకు గురికాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కుటుంబానికి దూరంగా ఉంటూ.. అడవి తల్లికి అంగరక్షకులుగా పని చేస్తున్నారు. అడవి జంతువులను కాపాడటంలోనూ శ్రద్ధ చూపుతున్నారు. ఇలా ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తున్న బేస్‌క్యాంప్ సిబ్బందిపై కథనం.. –జన్నారం



అడవిలో గస్తీ తిరుగుతున్న సిబ్బంది

అడవికి రక్షకులు..!

- రాత్రీపగలు అడవిలోనే గస్తీ
- తగ్గిన కలప అక్రమ రవాణా
- బేస్‌క్యాంప్ సిబ్బంది పనితీరు భేష్



గొండుగూడ బేస్‌క్యాంపు

నాలుగేళ్ల క్రితం ప్రారంభం

కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం. దట్టమైన అడవులు, వివిధ వన్యప్రాణులకు నిలయం. ఇక్కడ స్మగ్లింగ్ పెరుగుతుందనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బేస్‌క్యాంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంపునకు ఐదుగురిని నియమించారు. ప్రస్తుతం జన్నారం అటవీ డివిజన్‌లో 13, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 49 బేస్‌క్యాంపులున్నాయి. వీటిద్వారా 245 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరితో పాటు 59 మంది ఎనిమల్ ట్రాకర్స్ కూడా పని చేస్తున్నారు. ఏడు స్ట్రైకింగ్ ఫోర్స్‌లలో కూడా మరో 35మంది విధులు నిర్వహిస్తున్నారు.

జీత భత్యాలు.. సెలవులు

ఒక్కొక్కరికి రూ.12,046 వేతనం, రూ.3,380 ఫుడ్ అలవెన్స్ ఇస్తారు. రూ.900 ఈపీఎఫ్, ఇతర కటింగ్‌లు పోను సుమారు రూ.14 వేలు చెల్లిస్తారు. సిబ్బంది వారానికొకరు చొప్పున ఇళ్లకు వెళ్లాలి. ఒక వారం ఒకరు వెళ్తే.. మరో వారం మరొకరు వెళ్లాల్సి ఉంటుంది. అడవిలోపల ఉండే వారు మాత్రం నెలకోసారి వెళ్లివస్తుంటారు.

బేస్‌క్యాంపు సిబ్బంది విధులివీ..

బేస్‌క్యాంపు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమిస్తారు. 35 ఏళ్ల లోపువారికి 25 కిలోమీటర్ల నడక పరీక్ష, హెల్త్ ఫిట్‌నెస్ ద్వారా భర్తీ చేస్తారు. వీరు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పర్మినెంట్ బేస్‌క్యాంపులలో ఉంటూ ఉదయం 6నుంచి సాయంత్రం 8గంటల వరకు అడవిలో కేటాయించిన ప్రదేశంలో గస్తీ తిరగాలి. స్మగ్లింగ్‌ను నిరోధించాలి. వన్యప్రాణులను రక్షించాలి. వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు, కుంటలను పరిశీలించాలి. వేటగాళ్లు నీటి కుంటల వద్ద ఉచ్చులు పెట్టకుండా గమనించాలి. అడవిలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించాలి. ప్రతీరోజు చుట్టూ 10 కిలో మీటర్ల దూరం వరకు నడుచుకుంటూ వెళ్లి అడవిని పరిశీలించాలి. చూసిన ప్రతీ అంశాన్ని మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలి. ఈ వివరాలు ప్రతీరోజు బీట్ అధికారి, సెక్షన్ అధికారి వీరి వద్దకు వెళ్లి తెలుసుకుంటారు. ఉన్నతాధికారులు వీరి పనితనాన్ని గమనిస్తారు. త్వరలో ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా వారి మూమెంట్‌ను గుర్తిస్తారు.

క్యాంపు వద్ద వసతులు..

గతంలో బేస్‌క్యాంపు సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు లేవు. నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. రాత్రి చీకట్లో ఉండేవారు. జిల్లా కన్జర్వేటర్ వినోద్‌కుమార్, ఎఫ్‌డీవో మాధవరావు బేస్‌క్యాంపులను పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రతీ క్యాంపునకు పర్మినెంట్ గది ఏర్పాటు చేశారు. వారితో పాటు బీట్ గార్డు ఉండేలా గదులు నిర్మించారు. ప్రతీ క్యాంపు వద్ద సోలార్ లైట్, మంచె, నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. రాత్రి మంచెపై గస్తీ నిర్వహించడంతోపాటు విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.

చిరుతను దగ్గరగా చూసిన



ఎనిమిది నెలలుగా పని చేస్తున్న. ఒకరోజు గస్తీలో ఉండగా రాత్రి 9గంటలకు చిరుతపులి 150 మీటర్ల దూరంలో కనిపించింది. అది నన్ను చూడలేదు కాబట్టి బతికిపోయా. రాత్రివేళ ఎన్నో వన్యప్రాణులు కనిపిస్తాయి. అలవాటైంది. ఇప్పుడా భయం కూడా పోయింది. – కోవ దౌలత్‌రావు, మల్యాల బేస్‌క్యాంప్ సిబ్బంది

సౌకర్యాలు బాగున్నయ్



మాది కెరమెరి మండలం చౌపాన్ గూడ. రెండేళ్లుగా పని చేస్తున్న. గతంలో సౌకర్యాలు లేవు. ఇప్పుడు క్యాంపు దగ్గర సోలార్ లైట్ పెట్టిచ్చిన్రు. బోరింగు వేయించిన్రు. బాత్‌రూంలు, పర్మినెంట్ రూమ్ కట్టిచ్చిన్రు. సౌకర్యాలు మంచిగున్నయ్. జీతం పెంచితే బాగుండు.
– మడావి శేఖర్, మల్యాల బేస్‌క్యాంప్ సిబ్బంది

నిత్యం గస్తీ తిరుగుతం



రోజూ అడవిలో 10 కిలోమీటర్లు గస్తీ తిరుగుతం. వారానికోసారి అవసరమైన సరుకులు తెచ్చుకుంటం. ఉదయం వంట చేసుకుని అడవిలో గస్తీ తిరుగుతం. అడవిలో సీసీ కెమెరాలు, సోలార్ పంపులు, నీటి కుంటలు పరిశీలిస్తం. ఏదైనా ఇబ్బంది ఉంటే సార్లకు చెబుతం. – వసంతరావు, ఇందన్‌పల్లి బేస్‌క్యాంపు సిబ్బంది

స్మగ్లింగ్ తగ్గింది



బేస్‌క్యాంపు సిబ్బంది కారణంగా స్మగ్లింగ్ తగ్గింది. ఎప్పటికప్పుడు సిబ్బంది పనితీరు గమనిస్తున్నాం. విధుల్లో నిర్లక్ష్యం చేసినా, స్మగ్లర్లకు సహకరించినా తొలగిస్తాం. సిబ్బంది పని తీరు బాగుంటే తగిన ఫలితం ఉంటుంది. క్యాంపుల వద్ద వీరికి అన్ని సౌకర్యాలు కల్పించాం. – మాధవరావు, ఎఫ్‌డీవో

గస్తీ విధులు ఇలా..

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేస్తారు. వంట పాత్రలు శుభ్రం చేసి వండుకుంటారు. టిఫిన్ బాక్సులు, నీళ్ల బాటిళ్లతో అడవులకు బయలు దేరుతారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా అడవిలో ఎంచుకున్న ప్రాంతంలో తిరుగుతారు. వారి బేస్‌క్యాంపుల పరిధిలో నీటి చెలిమెలు, సాసర్ పిట్స్, జంతువుల కదలికలను గుర్తిస్తారు. ఆకలైన చోట అన్నం తింటారు. తిరిగి విధులు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలలోపు తిరిగి క్యాంపునకు చేరుకుంటారు. భోజనం అనంతరం రాత్రి పది గంటల దాకా గస్తీ నిర్వహిస్తారు. కలప నరికివేతకు స్మగ్లర్లు వస్తున్నారనే సమాచారం ఉంటే అటు వైపు వెళ్లి అక్కడే నిఘా పెడతారు. రాత్రంతా అక్కడే ఉంటారు. సమాచారం అధికారులకు చేరవేస్తారు. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో బారికేడ్లు, చెక్‌పోస్టులు, గేట్లు ఏర్పాటు చేశారు. రాత్రి క్యాంపులోని ఐదుగురిలో ఇద్దరు ఒక్కో గేటు వద్ద గస్తీ నిర్వహిస్తారు. ఒకరు బీట్ అధికారితో పాటు క్యాంపు వద్దే ఉంటారు. రాత్రి 10 తర్వాత అడవి జంతువులు, చిరుతపులుల, ఎలుగుబంట్ల అరుపులు వినిపిస్తాయి. మెకాలు, దుప్పులు అరుస్తాయి. వీరి పక్క నుంచే దుప్పులు, కొండగొర్లు, నీలుగాయిలు వెళ్తాయి. రాత్రి మంచె పక్కకు వస్తాయి. రాత్రి పూట అన్ని జంతువులూ కనిపిస్తాయి. అయినా వీరు జంకరు. బేస్‌క్యాంపుల ఏర్పాటుతో స్మగ్లింగ్ కొంతమేర తగ్గింది. రాత్రి వేళ సిబ్బంది గస్తీ తిరుగుతూ స్మగ్లర్లు వచ్చినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇచ్చి పట్టిస్తారు. దీంతో కేసులు నమోదు చేస్తుండడంతో స్మగ్లింగ్ తగ్గింది.

ఫోర్‌మెన్‌పై చర్య తీసుకోవాలి



డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న టీబీజీకేఎస్ నాయకుడు బ్రహ్మచారిపై చర్య తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి సోమవారం ఏరియా వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మచారి కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై కక్ష సాధిస్తున్నారని తెలిపారు. గతంలో ఎంవీ డ్రైవర్‌పై వేధింపులకు గురిచేస్తే అతను టింబర్ యార్డ్‌కు బదిలీ చేయించుకున్నారని అన్నారు. బ్రహ్మచారిపై ఇదివరకు ఫిర్యాదు చేసినా ఆయన పద్ధతి మారడం లేదన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం విజేతలు వీరే..

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అస్తిత్వం–తెలంగాణ సాధించిన ప్రగతి అనే అంశంలో నిర్వహించిన కవి సమ్మేళన విజేతలను డీఈవో యాదయ్య సోమవారం ప్రకటించారు. వచన కవిత విభాగంలో పెద్ది భరత్, భూపతి సంతోష్, లేదల్ల రాజేశ్వర్, యోగేశ్వర్, వైద్య సుజాత ఎంపిక కాగా, పద్యం, గేయం విభాగంలో వామన్‌రావు, పోటు హైమవతి, ప్రమీల, వసంత, బ్రహ్మయ్యను ఉత్తమ కవులుగా ఎంపిక చేశారు. దక్షిణామూర్తి, గాయత్రి, తోకల రాజేశం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

డబ్బాలో డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ కరుణాకర్

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సోమవారం విచారణ నిర్వహించారు. డబ్బా సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్ తనను దూషించారంటూ కుమురం నారాయణ ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కాగా ఈఘటనలో ఇరు వర్గాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అబ్దుల్ రషీద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గ్రామానికి చేరుకుని డీఎస్పీ విచారణ అనంతరం బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వాంగ్మూలాలు రికార్డు చేశారు. కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై విజయ్ కుమార్ ఉన్నారు.

పైపుల లారీ ఢీకొని విరిగిన స్తంభం



స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన గడ్డివాము

- విద్యుత్ వైర్లు తెగిపడి గడ్డివాము దగ్ధం

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామంలో మైలారం–ప్రాణహిత చేవెళ్ల మెగా కంపెనీ ప్రాజెక్టు నుంచి భారీ పైపులను తరలిస్తున్న లారీ సోమవారం సాయంత్రం రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగింది. రోడ్డు పక్కనే ఉన్న రత్నం శంకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన వరి గడ్డివాముపై తీగలు తెగి పడటంతో దగ్ధమైంది. వెంటనే సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో 2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్ వైర్లు తెగిపడటంతో చుట్టు పక్కల వారికి స్వల్ప నష్టం జరిగింది. గడ్డివాము దగ్ధమైన బాధిత కుటుంబం లారీలను రోడ్డుపైనే ఆపి ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, మెగా కంపెనీ యజమానితో ఎంపీపీ రమాదేవి ఫోన్‌లో మాట్లాడగా స్తంభం విద్యుత్ వైర్లకు మరమ్మతు చేయిస్తామని, బాధిత రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

బాక్సింగ్‌లో ప్రతిభ



అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ అండర్–10, 12, 14లో ప్రతిభ కనబర్చిన శ్రీరాంపూర్ ఏరియా బాల, బాలికలను ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అభినందించారు. సింగరేణి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఇటీవల సమ్మర్ క్యాంప్ నిర్వహించగా బాక్సింగ్‌లో పలువురు శిక్షణ పొందారు. వారు ఈనెల11న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో 7 బంగారు, 7 వెండి పతకాలు సాధించారు. జీఎం కార్యాలయం వద్ద జీఎం, అధికారులు సోమవారం వారిని అభినందించారు. గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ సీనియర్, పీవో కాంతారావు, కోచ్ పాదం రవీందర్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో జిల్లావాసి



సిల్వర్ మెడల్ సాధించిన స్థితప్రజ్ఞ రెడ్డి

మంచిర్యాలటౌన్: ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను స్పానిష్‌లో నిర్వహించగా, జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారుడు స్థితప్రజ్ఞ రెడ్డి ఫైనల్‌కు చేరి సిల్వర్ మెడల్ సాధించినట్లు ఎంకే మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ వికాస్ హర్ష తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో డెన్మార్క్ క్రీడాకారుడు భోగి భూజర్గ్‌తో తలపడి సిల్వర్ మెడల్ సాధించడంతో, క్రీడాకారుడిని, కోచ్‌ను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ పుల్లూరి సుధాకర్, మీనారెడ్డి, వాసు, సత్యపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మధు, కృష్ణ అభినందించారు.

జాబ్‌మేళాకు స్పందన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. డీమార్ట్ షాపింగ్ మాల్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 38 మంది హాజరు కాగా, 10 మందికి కంపెనీ లెటర్స్ అందించారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటరమణ, టీంలీజ్ సొల్యూషన్ హైదరాబాద్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు జయబాబు పాల్గొన్నారు.

అన్నను కాపాడబోయి..

- కరెంట్‌షాక్‌తో తమ్ముడు మృతి
- బూడిదగడ్డ బస్తీలో విషాదం



శరత్‌కుమార్ మృతదేహం

బెల్లంపల్లి: విద్యుత్‌షాక్‌కు గురైన అన్నను కాపాడేందుకు యత్నించి తమ్ముడు దుర్మరణం చెందాడు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో సోమవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య కథనం ప్రకారం.. బూడిదగడ్డ బస్తీలో ఉదయం 8:30 గంటల ప్రాంతంలో ఇసుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్ ఓ వీధిలోకి వెళ్లింది. డ్రైవర్ తిరుపతి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి విద్యుత్ సర్వీసు తీగను ఢీకొట్టాడు. తీగ తెగి అక్కడే నిలిపి ఉంచిన ఆటో పై పడింది. పెండ్యాల రాజ్‌కుమార్ ఆటోలో ఉన్న తన ఇద్దరు పిల్లలు కాపాడే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చిన్నారులు కదలకుండా ఆటోలో ఉండిపోయారు. రాజ్‌కుమార్‌కు వరుసకు తమ్ముడు శరత్‌కుమార్ (22) అక్కడికి చేరుకుని ఓ కర్రతో విద్యుత్ సర్వీసు వైరుపై కొట్టగా అది అతనికి తాకింది. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ రాజ్‌కుమార్ తమ్ముడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అన్నను రక్షించడానికి వెళ్లిన శరత్‌కుమార్ కరెంట్‌షాక్‌తో అర్థాంతరంగా ప్రాణాలు వదలడం స్థానికులను తీవ్రంగా కలిచి వేసింది. మృతుడు ఓ షాపులో గుమాస్తాగా, అతని తండ్రి శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎదిగిన కొడుకు కళ్లముందే కానరాని లోకానికి వెళ్లడంతో తండ్రి రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబీకులను పరామర్శించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కార్మికులకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



ఇన్‌చార్జి డీజీఎంకు వినతిపత్రం అందిస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సీహెచ్‌పీలో విధులకు హాజరయ్యేందుకు వచ్చే కార్మికుల కోసం రోడ్డు సౌకర్యం కల్పించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులు డ్యూటీకి రావడానికి రోడ్డు సరిగా లేదన్నారు. జాతీయ రహదారి నుంచి కార్మికులు మూడు షిఫ్టుల్లో డ్యూటీకి కార్మికులు వచ్చే క్రమంలో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. గోలేటికి వెళ్లేదారి నుంచి సీహెచ్‌పీకి నూతన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఏరియా కార్యదర్శులు వేణుగోపాల్, మరిశెట్టి దత్తు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కిష్టస్వామి, షిఫ్ట్ ఇన్‌చార్జి కుమార్ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్.. అత్యాచారయత్నం

- ఇద్దరు యువకులపై పోక్సో కేసు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటి ఆవరణ నుంచి బాలికను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి యత్నించిన ఘటన పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని శివారు కాలనీకి చెందిన బాలిక(15) ఇటీవలే పదో తరగతి పూర్తి చేసింది. ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో కూర్చున్న బాలికను ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు మత్తు మందుతో ఉన్న కర్చీఫ్‌ను ముఖంపై అదిమి సమీపంలోని చెట్ల పొదల్లోకి లాక్కెళ్లారు. లైంగిక దాడికి యత్నించారు. ఓ యువకుడు గంజాయి తాగుతూ పొగను బాలిక ముఖంపై ఊదడంతో ఆమె స్పృహ కోల్పోయింది. కూతురు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. అదే కాలనీకి చెందిన ఓ యువకుడిపై అనుమానం వచ్చి అతడి కుటుంబ సభ్యులను నిలదీశారు. యువకుడి కుటుంబ సభ్యులు వెంటనే అతడికి ఫోన్ చేసి నీ కోసం పోలీసులు వచ్చారని చెప్పారు. దీంతో బాలికను పొదల్లోనే వదిలేసి ఇద్దరు యువకులు పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత స్పృహలోకి వచ్చిన బాలిక ఇంటికి చేరుకుంది. బాలిక ముఖంతోపాటు పలుచోట్ల స్వల్పంగా గాయాలయ్యాయి. సోమవారం బాలికతోపాటు కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులపై పోక్సో, కిడ్నాప్, అత్యాచారయత్నం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో బి.స్వామి వెల్లడించారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న పద్మశాలి నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: బీసీ రుణం కింద పద్మశాలీలకు రూ.లక్ష ఇచ్చేలా ప్రభుత్వం జీవో జారీ చేయాలని కలెక్టరేట్ ఎదుట సంఘం నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. నిరసన అనంతరం కలెక్టరేట్ ఏవో సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్, గజెల్లి వెంకటయ్య, నాయకులు భాస్కర్, సత్యనారాయణ, ఓంప్రకాశ్, శంకరయ్య, కుమార్, సురేష్‌బాబు, శ్రీనివాస్, లింగమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.